పాఠశాలల పునః ప్రారంభానికి విద్యాశాఖ చర్యలు

- పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు పంపిణీకి కసరత్తు

అబిడ్స్, మే 23 : వేసవి సెలవుల అనంతరం జూన్ 12 తేదీ నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానుండడంతో అందుకనుగుణంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలను పంపిణీ చేసేందుకు విద్యాశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలను జూన్ 12వ తేదీ నాటికి శుభ్రం చేసి తరగతులు ప్రారంభమయ్యేలా చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే పలు మండలాలకు ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు చేరడంతో పాఠశాలలు ప్రారంభం కాగానే విద్యార్థులకు పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. నాంపల్లి, గోల్కొండ, ఆసిఫ్‌నగర్ మండలాలకు చెందిన డిప్యూటీ ఐఓఎస్ కార్యాలయాలకు ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు చేరగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేస్తున్నారు. అంతే కాకుండా యూనిఫాంలను కూడా పాఠశాలకు చేరేలా చూస్తున్నారు. అదే విధంగా జూన్‌లో ప్రతి రోజు ఉదయం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

జూన్ 12 నుంచి పాఠశాలలు ప్రారంభం..

జూన్ 12వ తేదీ నుంచి పాఠశాలను ప్రారంభిస్తుండడంతో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలన్న ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా విద్యా శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పాఠశాలలను శుభ్రం చేయడంతో పాటు పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలను పంపిణీ చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. నాంపల్లి మండలంలో 15 ఉన్నత, 26 ప్రైమరి పాఠశాలలు, 20 ఎయిడెడ్ పాఠశాలలు ఉన్నాయి. గోల్కొండ మండలంలో 31 ఉన్నత, ప్రైమరి 19, ఎయిడెడ్ పాఠశాలలు 7 ఉన్నాయి. ఆసిఫ్‌నగర్ మండలంలో 80 వరకు ఉన్నాయి. ఆయా పాఠశాలలో జూన్ ఒకటో తేదీ నాటికి సర్వం సిద్ధం చేసేలా డిప్యూటీ డీఈఓ వెంకటేశ్వర్ నేతృత్వంలో ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకుంటున్నారు.

గన్‌ఫౌండ్రిలోని మహబూబియా ప్రభుత్వ పాఠశాల

ఆలయాల అభివృద్ధికి బీఆర్ఎస్ పెద్దపీట

లక్ష రూపాయల చెక్కును బస్తీవాసులకు అందజేస్తున్న బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ

కవాడిగూడ, మే 23 : ఆలయాల అభివృద్ధికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఆ పార్టీ యువజన విభాగం నాయకుడు ముఠా జయసింహ అన్నారు. గురువారం కవాడిగూడలోని ఉన్నికోట దేవాలయ అభివృద్ధికి ముషీ రాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పంపించిన లక్ష రూపాయల చెక్కును ఆయన ఉన్నికోట బస్తీవాసులకు అందజేశారు. ఉన్నికోట ఆలయ అభివృద్ధికి బస్తీవాసుల అభ్యర్థన మేరకు ఎమ్మెల్యే లక్ష రూపాయలు సహాయంగా ఇచ్చారని ఆయన అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్ యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, బస్తీ వాసులు వల్లాల రవియాదవ్, ముద్దం శివగౌడ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

బుద్ధ జయంతి

గౌతమ బుద్ధుని జయంతి సందర్భంగా గురువారం హుస్సేన్‌సాగర్‌లోని బుద్ధుడి విగ్రహానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సిరిగిరి శ్యామ్, రాకం సత్యనారాయణ, జంగం అరుణ్, అరవింద్, వెంకటేశ్, ప్రేమ్‌కుమార్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.
– ముషీరాబాద్, మే 23

బెటర్ ట్రాజెక్టరీస్ గ్రంథావిష్కరణ

గ్రంథాన్ని ఆవిష్కరించిన హాస్యావధాని శంకరనారాయణ

ముషీరాబాద్, మే 23: చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో గురువారం రచయిత అంజన గోలి రచించిన బెటర్ ట్రాజెక్టరీస్ గ్రంథావిష్కరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో హాస్యావధాని శంకర నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని గ్రంథాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఆమెరికాలో సేవా కార్యక్రమాల నిర్వహణతోపాటు వ్యక్తిత్వ వికాస వ్యాస రచన, సాహిత్య రంగాల్లో రాణిస్తున్న అంజన గోలి ప్రశంసనీయురాలని కొనియాడారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు, రాయారావు విశ్వేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

అన్నమాచార్య జయంతి ఉత్సవాలు

ముషీరాబాద్, మే 23: నవ్య నాటక సమితి, అన్నమాచార్య మిషన్‌ల ఆధ్వర్యంలో గురువారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో తాళ్లపాక అన్నమాచార్య జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా 11 మంది నృత్య గురువులు, 50 మంది యువ కళాకారులచే నిర్వహించిన కూచిపూడి, భరత నాట్యం, శ్రీ పదార్చనలు ఆకట్టుకున్నాయి. ప్రభుత్వ మాజీ సలహాదారుడు డాక్టర్ కేవీ రమణాచారి పాల్గొని నృత్య కళాకారిణి పద్మినిని సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో వసుంధర, విజయ్‌కుమార్, ఆచార్య ఫణీంద్ర రజిత, గోదాలక్ష్మి, వేమరాజు నరసింహారావు పాల్గొన్నారు.

పద్మశ్రీ శోభరాజు సేవలు అభినందనీయం

కవాడిగూడ : అన్నమాచార్య జయంతి ఉత్సవాలు అన్నమాచార్య భావనా వాహిని ఆధ్వర్యంలో గురువారం పద్మశ్రీ డాక్టర్ శోభారాజు సారథ్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా చిక్కడపల్లిలోని శ్రీ వేంకటేశ్వరాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం శోభరాజు తన శిష్య బృందంతో కలిసి అన్నమాచార్య కీర్తనలు ఆలపిస్తూ మహానగర సంకీర్తన చేస్తూ ట్యాంక్‌బండ్‌పై గల అన్నమయ్య విగ్రహం వద్దకు చేరుకున్నారు. అన్నమయ్య విగ్రహం వద్ద ప్రముఖ గాయని మానసా ఆచార్య పాడిన కీర్తనలు ఆకట్టుకున్నాయి. చిలుకూరు బాలజీ ఆలయ ప్రధాన అర్చకులు శ్రీరంగరాజన్ మాట్లాడుతూ.. అన్నమయ్య తత్వాన్ని విశ్వవ్యాప్తం చేస్తున్న డాక్టర్ శోభరాజు సేవలు అభినందనీయమన్నారు. అన్నమయ్య జయంతి ఉత్సవాలు ప్రతిచోటా జరగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త డాక్టర్ అనంతలక్ష్మి, ప్రముఖ చిత్రకారుడు బ్నిమ్, విద్యావేత్త తిరునగరి జ్యోత్స్న పాల్గొనగా వేంకటేశ్వరస్వామి వేషధారణలో సందీప్, అన్నమయ్య వేషధారణలో మానస్ పటేల్ అలరించారు.

కీర్తనలు ఆలపిస్తున్న పద్మశ్రీ శోభరాజు

కళాకారిణిని సత్కరిస్తున్న ప్రభుత్వ మాజీ సలహాదారుడు డాక్టర్ కేవీ రమణాచారి

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

చిక్కడపల్లి, మే 23 : చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా జరుగుతున్నాయి. స్వామి వారికి ఉదయం సుప్రభాతసేవ, బింద తీర్థము తదితర కార్యక్రమాలు నిర్వహిచారు. సాయంత్రం స్వామివారి శేష వాహన సేవ చిక్కడపల్లి శ్రీనివాస పురం తిరువీధుల్లో మంగళ వాయిద్యాలతో అత్యంత వైభవంగా ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. కార్యనిర్వహణాధికారి కె. రామాంజనేయులు, వ్యవస్థాపక వంశీయుడు జి.శ్రీనాథ్‌గౌడ్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

స్వామివారి శేషవాహన సేవలో భక్తులు

గరుడ ప్రసాదం పంపిణీ ..

వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం గరుడ ప్రసాదం పంపిణీ చేశారు. సంతానం లేని మహిళలకు అందజేసే ఈ ప్రసాదానికి నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి మహిళలు తరలి వచ్చారు.

వెస్ట్ బెంగాల్ హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం..

గోల్నాక, మే 23: వెస్ట్ బెంగాల్ ప్రభుత్వం ముస్లింలకు ఇచ్చిన రిజర్వేషన్లను రద్దు చేస్తూ కోల్‌కతా హైకోర్టు ఇచ్చిన తీర్పును బీజేపీ స్వాగతిస్తోందని బీజేపీ నేత, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. వెస్ట్ బెంగాల్ తీర్పును స్వాగతిస్తూ గురువారం రాష్ట్ర బీజేపీ ఓబీసీ మోర్చ ఆధ్వర్యంలో అంబర్‌పేట అలీకేఫ్ చౌరస్తా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు... వెస్ట్ బెంగాల్‌లోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం 77 ముస్లిం వర్గాలను ఓబీసీలో చేర్చడాన్ని అక్కడి ఉన్నత న్యాయం స్థానం తప్పుపట్టిందన్నారు. ముస్లిం సమాజాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం బెంగాల్ ప్రభుత్వం ఓబీసీ హోదా కల్పించిందని ఆయన ఆరోపించారు. ముస్లిం రిజర్వేషన్లపై మాట్లాడితే ప్రధాని నరేంద్ర మోదీని తప్పు పట్టారని ఆయన అన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు డాక్టర్ గౌతమ్ రావు. జి.ఆనంద్‌గౌడ్, పూస రాజు, దివాకర్, కృష్ణాగౌడ్, సంజయ్, శ్యామ్‌రాజ్, వినోద్ యాదవ్, అమృత, ఉమారమేశ్‌యాదవ్, జగన్, యశ్వంత్, మల్లేశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేట జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద మీడియాతో మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మణ్

మట్టి కుప్పల తరలింపు

మల్లేపల్లి డివిజన్‌లోని అఫ్జల్‌సాగర్‌లోని పలు ప్రాంతాల్లో పేరుకుపోయిన మట్టి కుప్పలను గురువారం జీహెచ్‌ఎంసీ అధికారులు తొలగించారు. జీహెచ్‌ఎంసీ సర్కిల్–12 డిప్యూటీ కమిషనర్ నాగేశ్వర్ రావు ఆదేశాలతో సిబ్బంది మట్టి కుప్పలను తీసివేశారు. – మెహిదీపట్నం, మే 23

పోచమ్మ అమ్మవారి వార్షికోత్సవం

అంబర్‌పేట, మే 23 : నల్లకుంట డివిజన్ నర్సింహబస్తీలో శ్రీపోచమ్మ అమ్మవారి 13వ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. అమ్మవారికి విశేష అభిషేకం, అలంకరణ, కుంకుమార్చన నిర్వహించారు. పూజల్లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, బస్తీవాసులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

తాళ్లపాక పద సాహిత్యానికి వెంకట్ సేవలు అద్వితీయం

గ్రంథాలు ఆవిష్కరిస్తున్న డాక్టర్ కేవీ రమణాచారి, వెంకట్ గరికపాటి

రవీంద్రభారతి, మే 23 : తాళ్లపాక పద సాహిత్యానికి వెంకట్ గరికపాటి చేస్తున్న సేవలు అద్వితీయమని, తెలుగు సాహిత్య వనంలో వెంకట్ గరికపాటి వ్యాఖ్యానం గ్రంథాలు చిరకాలం పరిమళిస్తాయని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారుడు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. గురువారం రవీంద్రభారతిలోని ప్రధాన మందిరంలో శ్రీరామ సాంస్కృతి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన తాళ్లపాక అన్నమయ్య 616వ జయంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి ప్రసంగించారు. ఒక పుస్తకం రాయడమే ఘనమని భావించే ఈ రోజుల్లో 22 పుస్తకాలకు కృతి కర్త కావడం మామూలు విషయం కాదని రమణాచారి అన్నారు. దీని వెనుక వెంకట్‌కు ఉన్న అభిరుచి, అనురక్తి, అకుంఠిత దీక్ష దాగి ఉన్నాయని అన్నారు. ప్రముఖ సాహితివేత్త సుధామ మాట్లాడుతూ.. వెంకట్ గరికపాటి అన్నమయ్య అన్న పదానికి పర్యాయ పదంగా మారాడని అన్నారు. వెంకట్ గరికపాటి విరచితమైన 21వ 22వ వ్యాఖ్యాన గ్రంథాలు ఆవిష్కృతమయ్యాయి. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన స్టేట్‌బ్యాంక్ స్టాఫ్ కాలేజీ డైరెక్టర్ ప్రకాశ్ చంద్రబరోడ, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డా.మామిడి హరికృష్ణ తదితరులు ప్రసంగించారు. ప్రముఖ సంగీత గురువు శ్రీరామాచారి తన శిష్యబృందంతో ఆలపించిన శ్రీరామాంజనేయ రమ్యగీతక గోష్టిక శ్రోతలకు విందు చేసింది. గాయని సురేఖ మూర్తి సభా కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీరామ సాంస్కృతక సంస్థ గోర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అన్నమయ్య జయంతి ఉత్సవాలు కనులపండువగా జరిగాయి.

తెలంగాణ సాహిత్య అకాడమీలో..

సాహిత్య అకాడమీ, హరిహర ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నమాచార్య జయంతిని గురువారం తెలంగాణ సాహిత్యఅకాడమీలో నిర్వహించారు. అన్నమయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అకాడమీ కార్యదర్శి ఎన్.బాలాచారి, హరిహర ఫౌండేషన్ చైర్మన్ మారగాని శ్రీనివాసరావు, కార్యదర్శి రామదాసు, రవిబాబు, అతిథి ఎడిటర్ వెంకటేశ్వరరావు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

మెహిదీపట్నం, మే 23 : విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా ఆసిఫ్‌నగర్ విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని 11కేవీ వినోభానగర్ ఫీడర్, 11 కేవీ దర్గా కేబుల్ ఫీడర్,11 కేవీ నారాయణమ్మ కాలేజ్ ఫీడర్,11 కేవీ ఒయాసిస్ స్కూల్ ఫీడర్‌లలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మెహిదీపట్నం సీబీడీ ఏడీ ఓ ప్రకటనలో తెలిపారు.

ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకు..

వినోభానగర్, ఓయూ కాలనీ, మిని ఓయూ కాలనీ, భారత్ గ్యాస్, ఇండియన్ గ్యాస్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.

మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు..

గుల్షన్ కాలనీ, షేక్‌పేట్ నాలా, నారాయణమ్మ కాలేజీ, లక్ష్మణ్‌నగర్, దర్గా కేబుల్ మొత్తం ఏరియా, వినాయకనగర్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదు.

2.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు..

లక్ష్మీనగర్, ఫాల్కన్ కాలనీ, షేక్‌పేట్ కల్లు కంపౌండ్, డిస్నీర్ వ్యాలీ, రాధేనగర్, లెదర్ ఫ్యాక్టరీ ప్రాంతాలలో విద్యుత్ ఉండదు.

3.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు

నేతాజీనగర్, శ్రీనివాస్ నగర్, జ్యోతిన గర్, సర్దార్ బాగ్, మోఘల్ కా నాలా, ఒయాసిస్ స్కూల్, ఫాల్కన్ వ్యాలీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదు.

ఆజామాబాద్ డివిజన్ పరిధిలో..

ముషీరాబాద్: ఆజామాబాద్ డివిజన్ 11కేవీ రామాలయం, బ్రాహ్మణ హాస్టల్, కమలానగర్, సీపీఎల్ ఫీడర్‌ల పరిధిలో విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆజామాబాద్ డివిజన్ ఏడీఈ ఎం.విజయ భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకు..

రామాలయం ఫీడర్ పరిధిలోని న్యూ నల్లకుంట, నరేంద్ర పార్కు, సిండికేట్ బ్యాంక్, రామాలయం పరిసర ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదు.

మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు..

బ్రాహ్మణ హాస్టల్ ఫీడర్ పరిధిలోని ఇందిరానగర్, బ్రాహ్మణహాస్టల్, తిలక్‌నగర్ ఆసుపత్రి ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదు.

మధ్యాహ్నం 2.30 నుంచి 4 గంటల వరకు..

కమలానగర్ ఫీడర్ పరిధిలోని కమలానగర్, క్రిష్ణానగర్, శంకర్‌నగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.

సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు..

సీపీఎల్ ఫీడర్ పరిధిలోని పటేల్‌నగర్, పటేల్‌వాడ, ప్రేమ్‌నగర్, సీపీఎల్ క్వార్టర్స్ పరిసర పాంతాల్లో కరెంటు సరఫరా ఉండదు.

రైలు ఢీకొని ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మృతి

కాచిగూడ,మే 23: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. కాచిగూడ రైల్వే హెడ్ కానిస్టేబుల్ మక్బూల్ వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి(50) బుద్వేల్–ఉందానగర్ రైల్వేస్టేషన్ల మధ్య గురువారం రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుడు బూడిది రంగు చొక్కా, నల్ల రంగు ప్యాంట్ ధరించి, 5.2అడుగుల ఎత్తు ఉన్నట్లు తెలిపారు. ఆచూకీ కోసం 9912221985 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

మరో ఘటనలో ..

పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన కాచిగూడ పరిధిలో జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణాచారి తెలిపిన ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి(30) గురువారం సీతాఫల్‌మండీ రైల్వేస్టేషన్‌లో పట్టాలు దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుడు పింక్ టీషర్ట్, నీలిరంగు జీన్స్ ధరించి, 5.6 అడుగుల ఎత్తు ఉన్నట్లు తెలిపారు. పూర్తి వివ రాల కోసం 8143807592 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అకోలా రైలులో చోరీ

కాచిగూడ,మే 23: అకోలా రైలులో ఇద్దరి ప్రయాణికుల బంగారు ఆభరణాలు, నగదును గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన ప్రకారం.. ముషీరాబాద్‌కు చెందిన ఆత్మభాను(41)అకోలా రైలులో కాచిగూడకు వస్తుండగా కర్కేలి రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు 2.5 బంగారు ఆభరణాలు, రూ.2 వేల నగదు, ఫోన్‌ను దొంగిలించారు. అదేవిధంగా అల్వాల్‌కు చెందిన నారాయణ్ రామ్(46)అదే రైల్లో కాచిగూడకు వస్తుండగా కర్కేలి స్టేషన్ సమీపంలో దుండగులు రూ.38 వేల నగదు, తులం బంగారు ఆభరణాలు, పాన్‌కార్డు, ఆధార్‌కార్డును దొంగిలించారు. దీంతో వారు గురువారం కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి నాందేడ్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు తెలిపారు.

బీసీ రిజర్వేషన్లను ఏబీసీడీలుగా వర్గీకరించాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో వృత్తి సంఘాల నాయకులు

చిక్కడపల్లి, మే 23 : స్థానిక సంస్థల బీసీ రిజర్వేషన్‌లో ఏ, బీ, సీ, డీ వర్గీకరణ చేసి బీసీల అన్ని తరగతులకు రిజర్వేషన్లు అందించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. వివిధ వృత్తి సంఘాల ఆధ్వర్యంలో గురువారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో స్థానిక సంస్థల రిజర్వేషన్‌లో ఏబీసీడీ వర్గీకరణ చేపట్టాలని రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రొఫెసర్ సుదర్శన్‌రావు, తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య, ప్రొఫెసర్ భాగయ్య తదితరులు హాజరై మాట్లాడారు. మేదర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జోరిగల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పల్లపు విఘ్నేశ్, వెంకటకృష్ణ, విశ్వకర్మ వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాళ్లబండి కుమారస్వామి, బోయ హక్కుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మీనంగిరి గోపి, సుధాకర్, జంపాల రాజేశ్, బాలరాజు, ఏఎల్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ సుదర్శన్‌రావు

లక్ష్మీనరసింహస్వామి జయంతి వేడుకలు



అబిడ్స్, మే 23 : లక్ష్మీనరసింహ స్వామి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కోఠిలోని ఆలయంలో గురువారం నరసింహ అవతార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ట్రస్టీ గోవింద్ రాఠి నేతృత్వం లో జరిగిన ఈ ఉత్సవాలకు దేవాదా యశాఖ డిప్యూటీ కమిషనర్ రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్, గోషామహల్ కార్పొరేటర్ లాల్‌సింగ్, మాజీ కార్పొరేటర్ ముఖేశ్‌సింగ్, సుమిత్ రాఠి, అమిత్ రాఠి, మేఘారాణి అగర్వాల్, రమేశ్ వ్యాస్ పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ హైదరాబాద్ చాంప్.. భవేశ్‌రెడ్డి జోడి విజయం

నేరేడ్‌మెట్, మే 23: బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ నిర్వహించిన హైదరాబాద్ జిల్లా చాంపియన్‌షిప్ టోర్నీలో యువ షట్లర్లు భవేశ్‌రెడ్డి, సాయిష్ జోడి విజేతలుగా నిలిచారు. మే20న మాదాపూర్‌లోని గేమ్‌పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీలో అండర్ 13, 15, 17, 19 ఓపెన్ టోర్నీలు నిర్వహించారు. అండర్ 13 బాలుర డబుల్స్ ఫైనల్‌లో భవేశ్ రెడ్డి, సాయిష్ ద్వయం 21–14, 21– 19తో దర్శ్ గోయల్, ధ్రువ్‌సింగ్ జంటపై అద్భుత విజయం సాధించారు. టైటిల్ విజయంతో రాష్ట్ర టోర్నీలకు అర్హత సాధించారు. మొదటి నుంచే అద్భుతంగా ప్రత్యర్థులను చిత్తు చేస్తూ ఆడారు. అంతకు ముందు అండర్–13 విభాగంలో క్రిషవ్ ద్వయం 21–10,21–16తో భవేశ్‌రెడ్డిపై అద్భుత విజయం సాధించడంతో భవేశ్ సిల్వల్ మెడల్‌తో సరిపెట్టుకున్నాడు. భారతీయ వర్ధమాన మహిళా బాక్సర్ నిఖత్ జరీన్, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ చాముండేశ్వరీనాథ్, బ్యాట్ జాయింట్ సెక్రటరీ యూవీఎన్ బాబు, బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి కే. వంశీధర్, బ్యాట్ ఆఫీస్ సెక్రటరీ పీవీఎల్ కుమార్, శారద తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.

బహుమతులు అందుకుంటున్న భవేశ్‌రెడ్డి జోడీ

విద్యుత్ సమస్యల్లేకుండా చర్యలు తీసుకోండి



విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంఐఎం పార్టీ ఎమ్మెల్సీ మిర్జా రహమత్ బేగ్ ఖాద్రి అన్నారు. పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాలతో గురువారం టీజీఎస్ పీడీసీఎల్ చైర్మన్ ముషార్రఫ్ ఫారూఖీతో సమావేశమయ్యారు. మల్లేపల్లి డివిజన్ ఎంఐఎం నాయకుడు జాఫర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.
– మెహిదీపట్నం, మే 23

టీఎన్జీవో కేంద్ర ప్రధాన కార్యదర్శిగా ముజీబ్‌హుస్సేనీని నియమించాలి

సుల్తాన్‌బజార్, మే 23 : టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ముజీబ్‌హుస్సేనీని నియమించాలని కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్‌ను పీవీ నరసింహారావు వెటర్నరీ యూనివర్సిటీ అధ్యక్షుడు మహమ్మద్ షర్ఫుద్దీన్ కోరారు. గురువారం నాంపల్లిలోని గృహకల్ప ఆవరణలోని జిల్లా శాఖ కార్యాలయంలో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శిగా పోటీ చేస్తున్న టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌ఎం ముజీబ్‌హుస్సేనీని ఆయన మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. సమస్యల పరిష్కారానికి హుస్సేనీని నియమించాలన్నారు. కార్యక్రమంలో పీవీ నరసింహారావు వెటర్నరీ యూనివర్సిటీ ప్రధాన కార్యదర్శి ఆర్ సుదర్శన్, అసోసియేట్ అధ్యక్షుడు జీ. ఆంజనేయులు, కార్య నిర్వాహణ కార్యదర్శి టి నరసింహ, ఉపాధ్యక్షుడు మధుసూదన్, కార్యవర్గ సభ్యులు టి రాజ్‌కుమార్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎం ముజీబ్‌హుస్సేనీని సన్మానిస్తున్న షర్ఫుద్దీన్ తదితరులు

మల్లేపల్లిలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు



మెహిదీపట్నం, మే 23 : మల్లేపల్లి డివిజన్‌లో మురుగునీటి వ్యవస్థను మెరుగుపర్చేందుకు జలమండలి అధికారులు గురువారం చర్యలు చేపట్టారు. మల్లేపల్లి ఇత్తేహాద్ గ్రౌండ్ సమీపంలో సీవరేజీ లైన్లలో బ్లాకేజీలు ఏర్పడి మురుగు నీరు రోడ్లపైకి చేరిం ది. దీనిపై స్థానికులు ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్‌కు ఫిర్యాదులు చేయడంతో ఆయన ఆదేశాలతో ఎంఐఎం నాయకుడు జాఫర్‌ఖాన్ జలమండలి అధికారులతో మరమ్మతులు పూర్తి చేశారు.

ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా కృషి

సుల్తాన్‌బజార్, మే 23: ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా టీఎన్జీవో, తెలంగాణ నాల్గవ తరగతి కేంద్ర సంఘాలు సమష్టిగా కృషి చేస్తున్నాయని సంఘం అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్, ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ అన్నారు. గురువారం నాంపల్లి గృహకల్ప ఆవరణలోని నాల్గవ తరగతి కేంద్ర సంఘం భవనానికి విచ్చేసిన టీఎన్జీవో అదిలాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు ఎస్. అశోక్, కార్యదర్శి నవీన్‌లను సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉద్యోగుల డిమాండ్ల సాధన, పదోన్నతుల కోసం కృషి చేస్తున్నట్లు వివరించారు. నాల్గవ తరగతి కేంద్ర సంఘం సభ్యులు ఖాదర్ బిన్ హసన్, బి. రాజేందర్, జి. శ్రీనివాస్ పాల్గొన్నారు.

టీఎన్జీవో అదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎస్. అశోక్, కార్యదర్శి నవీన్‌లను సన్మానిస్తున్న నాయకులు

పేదలకు వస్త్రాలు పంపిణీ

భీమ్‌సేన్ జైస్వాల్ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం పేదలకు వస్త్రాలను పంపిణీ చేశారు. గౌలిగూడలో ఆయన తనయుడు, జాంబాగ్ కార్పొరేటర్ రాకేశ్‌జైస్వాల్ పేదలకు వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో అమర్‌సింగ్, సుధీర్, అనిల్‌యాదవ్, కాజల్, రామకృష్ణ, రేణుక, రఘు, రాంబగాడే పాల్గొన్నారు. –అబిడ్స్